ACCION FRATERNA
ecology centre
sustainable . human . nature

# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

## ఈ మాసపు సమాచారం

ఆగస్ట్, 2011

FOR PRIVATE CIRCULATION ONLY

# ఈ సంవత్సరం మనం అమలు చేసుకుంటున్న పథకాలను సమర్థవంతంగా, గడువుకు ముందుగానే పూర్తి చేసుకుందాం.

*సస్యమిత్ర గ్రూపు సభ్యులు, గ్రామ సమాఖ్య, మండల సమాఖ్య సభ్యులు, కన్వీనర్లు, కో-కన్వీనర్లు, కార్యకర్తలందరికీ నా నమస్కారములు.*

పోయిన నెల మనం మన కార్యక్రమాలను ప్రణాళికా బద్ధంగా అమలు చేసుకోవడంలో అతి ముఖ్యమైన విషయాలను గురించి మాట్లాడుకున్నాం. ఈ నెల మనం కార్యక్రమాలను గడువుకు ముందుగానే విజయవంతంగా పూర్తి చేసుకోవాల్సిన విషయాల్ని గురించి చర్చించుకుందాం.

మనం ఈ సంవత్సరం కొన్ని పథకాలు రూపొందించుకున్నాం. వాటిని విజయవంతంగా పూర్తి చేసుకోవడానికి విధించుకున్న కాలపరిమితికి ముందే ఫలితాలు సాధించాలని ప్రయత్నిస్తూ ఉన్నాము. మీ పూర్తి సహాయ సహకారాలతో కార్యక్రమాల్ని ముందుగానే పూర్తిచేసుకోగలమన్న విశ్వాసం నాకుంది. నదిలో పోతున్న నీటిని పూరికే పైకి రావాలని కోరుకుంటే రావు. అందుకు ఆనకట్ట కట్టాలి. ఆనకట్ట కూడా ఆకాశం నుంచి వూడిపడదు. ఒక్కొక్క రాయిని పేర్చుకుంటూపోతే ఆనకట్ట తయారవుతుంది. మనం కోరుకున్నట్లుగా నీళ్ళు వస్తాయి. ఇది పూర్తవడానికి బలమైన కోరిక, పట్టుదల, కార్యదీక్ష శ్రమల ద్వారానే సాధ్యమవుతుంది. అదే విధంగా మనం ఇష్టంగా పనులు ప్రారంభించి పథకాల్ని సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలనే పట్టుదల, శ్రమ అవసరమవుతాయి. అప్పుడే మనం మంచి ఫలితాల్ని సాధించగలం. ఈ దిశగా మనం ముందుకు సాగుదాం. పథకాల అమలులో కార్యకర్తలు కీలక బాధ్యతలు నిర్వహిస్తారు. వారందిస్తున్న సేవలకు ప్రతి పథకానికి ప్రోత్సాహకాలు ఇవ్వబడుతున్నాయి.

## సస్యమిత్ర గ్రూపులు, సస్యమిత్ర సమాఖ్యల సమావేశాలు

గ్రామ స్థాయిలో సస్యమిత్ర గ్రూపులు, సస్యమిత్ర సమాఖ్యల నెలవారి సమావేశాలు కార్యక్రమాల అమలుకు అవసరాన్ని బట్టి ఏర్పాటు చేసుకోవాలి. కనీసంగా ఈ సంవత్సరం 12కు తక్కువ కాకుండా నిర్వహించుకోవాలి. మీ గ్రామంలో ఈ సంవత్సరం చేపట్టే కార్యక్రమాలను సమర్థవంతంగా మీ ఆధ్వర్యంలో అమలు చేయడం కోసం ఈ సమావేశాలు అవసరమౌతాయి. ఈ సమావేశాలకు సభ్యులందరూ హాజరు కావాలి. సభ్యులందరి అభిప్రాయాలకు విలువ ఇవ్వాలి. ముఖ్యంగా మహిళా సభ్యుల పాత్ర పోషించి వారి అభిప్రాయాలు గమనించాలి. చేస్తున్న పనిలో మరింతగా నాణ్యత సాధించడానికి మార్గాలు అన్వేషించాలి. అత్యంత పారదర్శకంగా ప్రజాస్వామిక పద్ధతుల ద్వారా నిర్వహించే ఈ సమావేశాలలో లబ్ధిదారుల ఎన్నిక కార్యక్రమాల సమీక్ష, అమలులో సమస్యలు మొదలగు అంశాలు చర్చించి నిర్ణయాలు తీసుకోవాలి, ఒకరి ఆలోచనను మరొకరు అందిపుచ్చుకోవడంలోనూ రైతుల మధ్య సుహృద్భావ వాతావరణం ఏర్పడడానికి ఈ సమావేశాలు ఉపయోగపడుతాయి. ఎంతో నిరాశ, నిస్పృహలతో నిండిపోయిన వ్యవసాయాన్ని అందరూ ఒక్కటై, ధైర్యంగా వ్యవసాయాన్ని కుటుంబ ఆదాయవనరుగా మార్చుకోవడానికి కూడా ఈ సమావేశాలు ఉపయోగపడుతాయి. సమావేశాల్ని ప్రజాస్వామ్యయుతంగా, పారదర్శకంగా నిర్వహిస్తూ మనం నిర్వహించే కార్యక్రమాల అమలుకు సంబంధించిన విషయాలతోపాటు, రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను కూడా ఈ సమావేశాలలో చర్చించుకుంటూపోతే, సభ్యులందరూ ఆసక్తిగా పాల్గొంటారు. ఏమైనా సమావేశాలు సక్రమంగా జరుగలేదంటే అవి ప్రజాస్వామ్యయుతంగా పారదర్శకంగా జరపడంలేదన్నట్లుగా మనం అర్థం చేసుకోవాలి. మొక్కుబడి సమావేశాలుగాక, అర్థవంతమైన సమావేశాలుగా తీర్చిదిద్దాలని సభ్యులందరినీ కోరుతున్నాను.

## పొలంబడుల నిర్వహణ

పొలంబడులలో పాల్గొనడం అంటే, పంట పొలాలను రైతుల బృందం ప్రత్యక్షంగా సందర్శించి, పంటల ఎదుగుదలను పంటల కొచ్చిన చీడ పీడల్ని పరిశీలించి, వాటిని మనం అర్థం చేసుకోవడమేగాకుండా వాటిని అదుపు చేయడానికి మనమేం చేయాలో కలిసి చర్చించుకోవడం అన్నమాట. పొలంబడులలో నిర్వహించే రికార్డులద్వారా మరుసటి సంవత్సరంలో కూడా వీటిని మనం మార్గదర్శకాలుగా ఉపయోగించుకోవచ్చు. కనీసంగా 25 మంది రైతులతో (సగం స్త్రీ సభ్యులతో) గ్రామ స్థాయిలో ప్రతి నెల రెండు పొలంబడులు నిర్వహించాలి. ఖరీఫ్‌లో ఎనిమిది పొలంబడులు రబీ పంటకాలంలో 8 పొలంబడులు నిర్వహించాలి. ఈ పొలంబడుల ద్వారా పంటల్ని నేలల్ని, ప్రకృతికి అనుగుణంగా అర్థం చేసుకోవడంలో సహాయపడుతాయి. ఎప్పుడైతే ప్రకృతికి, పంటలకు ఉన్న అవినాభావ సంబంధాన్ని గురించి అర్థం అవుతుందో, అప్పుడు మనం వ్యవసాయాన్ని గురించి సరిగ్గా అర్థం చేసుకోగలమన్న విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి.

## క్లష్టరు స్థాయిలో జెండరు శిక్షణలు

ఈ సంవత్సర కాలంలో కనీసంగా క్లష్టరు స్థాయిలో రెండు జెండరు శిక్షణ సదస్సులను ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుంది. జెండరు శిక్షణా సదస్సుకు మహిళలు, పురుషులు కలిసి హాజరవ్వాలి. మన సాంఘిక జీవనంలోనూ, కుటుంబ స్థాయిలోనూ స్త్రీ, పురుషుల మధ్య సంబంధాలు అసమాన స్థాయిలో ఉన్నాయి. ఈ అసమానతలు పోయినంతవరకూ మనం అభివృద్ధిని సాధించలేమని ప్రధానంగా గుర్తుంచుకోవాలి. ముఖ్యంగా వ్యవసాయంలో స్త్రీలు పురుషులు సమాన స్థాయిలో పరస్పరంగా పాటుపడితేనే మంచి ఫలితాల్ని పొందగలం. కాబట్టి జెండర్ శిక్షణలను ఆట విడుపు కార్యక్రమాలుగాకాక, ప్రకృతిలో సమానమైన స్త్రీ పురుషుల సమానత్వ దిశగా ముందుకు పోయేవిధంగా మనం కొత్త కొత్త విషయాలను అవగాహన చేసుకోవడానికి ఈ జెండర్ శిక్షణా తరగతుల్ని సద్వినియోగం చేసుకోవాలి.

→

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్థిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు